# చరిత్రకెక్కిన చరితార్థులు

## టంగుటూరి ప్రకాశము పంతులుగారు

- వాసంతి మాఘుపు.

ఎనిమిది పదులు మీద పడిన తరుణములో నున్న ఒకతని పుట్టినరోజు నాడు ఓ యువకుడు అతనికి నమస్కరించి, "ఈ సంవత్సరము మీ పుట్టినరోజున శుభాకాంక్షలు చెప్పే అవకాశము వచ్చింది. వచ్చే సంవత్సరానికి కూడా ఆ భాగ్యము కలుగాలని కోరుకుంటున్నాను." అన్నాడు అతని వయస్సును దృష్టిలో ఉంచుకుని. వెంటనే ఎనభై య్యవ పడిలో నున్న ఆయన "ఒరే అబ్బాయీ! వయస్సు చూస్తే ఇంకా మీసము మొలిచినట్లు లేదు. నీకంత కష్టమేమి వచ్చిందిరా?" అన్నాడు. గతుక్కుమనడం యువకుని వంతు అయింది. ఇంతకీ ఎనిమిది పదులు పూర్తి చేసుకున్న ఆ వ్యక్తి ఎవరో కాదు, సాక్షాత్తూ శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులుగారు. అచంచలమైన ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పము, గంభీరవదనము, మృదువైన మనస్సు, విలువలకే విలువిచ్చే విశాల హృదయులు ప్రకాశము పంతులుగారు. వేమూరి వేంకట రామనాధంగారు "స్వాతంత్ర్యసిద్ధి" పద్యకావ్యములో చెప్పినట్లు ఆయన

సీ. కని నంతనే సింగ మనిపించి కుదిలించు
వాడి చూపుల నోలలాడు వాడు
ఎంత విశాలమో అంత గంభీరమౌ
ముఖమున ఠీవి సొంపొందు వాడు
పెరిగెడి వయసును పరిహసించుచు నిత్య
యౌవన ధాటితో నలరు వాడు
కలువ తెల్ల తనంపు కనుల యకల్మషో
త్తేజమ్ము చిమ్మెడు తేట వాడు
గీ. బిరుదుకే కాక జీవిత సరణి నెల్ల
'ఆంధ్రకేసరి' నిజముగ నైనవాడు
టంగుటూరి ప్రకాశము, రంగమెక్కి
తెల్ల దొరలకు వెఱ పిచ్చు దిట్ట వాడు;

గీ. తెల్ల దొరల శతఘ్నుల జల్లు ముందు
కంప మందక అంగీని చింపివేసి
ఱొమ్ము విఱుచుక నిల్చిన బొమ్మ వాడు
భయమునకె ప్రతి వచన నిర్వచన మతడు.



( August 23, 1872 - May 20, 1957 )

'ఆంధ్రకేసరి'గా మనందరికి తెలిసిన శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి జీవిత విశేషములను, ఆగష్టు 23 ఆయన జయంతి సందర్భముగా, గుర్తు చేసుకునే ప్రయత్నము చేద్దాం!

ప్రకాశంగారు 1872 ఆగష్టు 23 వతేదీన సుబ్బమ్మ, వెంకట నరసింహంగార్ల సంతానముగా ఒంగోలు జిల్లాలోని (నేటి ప్రకాశం జిల్లాలోని) కనపర్తి గ్రామములో జన్మించిరి. అతని పూర్వీకులు గుంటూరులోని టంగుటూరు గ్రామములో కరణముగా (village officer) పని చేసేవారు. ప్రకాశంగారు పదకొండు సంవత్సరముల వయస్సులో తండ్రిగారు పరమపదించడము వలన కుటుంబ పోషణ, పిల్లల విద్యాభ్యాసముల బాధ్యత ప్రకాశంగారి అమ్మగారైన సుబ్బమ్మగారిపై పడింది. దీని కొఱకై ఆమె, సమాజములో ఆనాడు గౌరవప్రదమైన వృత్తిగా జనులు గుర్తించకపోయినా, ధైర్యముగా ఒక ఫలహారశాలను నడపసాగారు.

తరువాత ప్రకాశంగారిని వారి మేనమామగారు ఒంగోలు తీసుకువచ్చి గవర్నమెంట్ నార్మల్ స్కూలులో లోయర్ ఫోర్త్‌లో ప్రవేశపెట్టారు. అక్కడే ప్రకాశంగారు మిడిల్ స్కూల్ పరీక్షకు హాజరయి మొదటి తరగతిలో ఉత్తీర్ణులయ్యారు. అక్కడే ఆయనకు ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారి పరిచయము ఏర్పడినది. మిషన్ స్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆయన ప్రకాశంగారిని కన్న కుమారుని కంటే ఎక్కువగా ఆదరించారు. ఒకసారి స్కూలు పరీక్ష రుసుము మూడు రూపాయల కొఱకు ప్రకాశంగారు 25 మైళ్ళు నడిచి వారి పెద్ద అక్క భర్తగారి ఇంటికి వెళ్ళారు. చిన్నతనమునుండి తన చిన్నక్క గారింటికి, మేనమామల ఊరు, ఇంకా దగ్గరలోని గ్రామములకు నడిచేవెళ్ళడం ఆయనకి అలవాటే. ఇదే ఆయనను చివరివరకు బలిష్టంగా ఉంచిందని ఆయనే పలుమార్లు ప్రస్థావించడం జరిగింది. మంచి శరీర చాయ, దేహదార్ఢ్యము కలిగి వీధి నాటకములలో స్త్రీ పాత్రలను, పురుషపాత్రలను ధరించేవాడు. క్రికెట్ ఆడుతుండేవాడు.

బాల్యం నుంచి న్యాయవాద వృత్తిపై ఆసక్తిని కలిగిన ప్రకాశంగారు, మధ్యలో చెడు సావాసములలో పడి, నాటకములలో మితిమీరి పాల్గొంటూ, మెట్రిక్యులేషన్ పరీక్షలో కృతకృత్యులు కాలేకపోయారు. తరువాత పట్టుదలతో ప్రైవేటుగా చదివి 1889లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. తరువాత 1891లో యఫ్. ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయ్యి, 1892లో ప్లీడరు పరీక్షకోసం సాధన ప్రారంభించారు. తరువాత 1894వ సంవత్సరములో రాజమహేంద్రవరంలో ప్రాక్టీసు పెట్టిన కొద్ది కాలానికే మంచి పేరు సంపాదించారు. 30 ఏళ్ళ ప్రాయంలోనే రాజమహేంద్రవరం మున్సిపల్ కౌన్సిలర్‌గా నెగ్గి, మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నుకోబడ్డారు.

రెండవ గ్రేడు ప్లీడరుగా ఆయనకు పెద్ద కోర్టులలో వాదించే అవకాశము ఉండేది కాదు. స్వామినాథన్ అనే ప్లీడరుగారి ప్రోత్సాహముతో ప్రకాశంగారు బారిష్టరు చదువును పూర్తి చేసేందుకు

నిర్ణయం తీసుకున్నారు. 1904 వ సంవత్సరములో ఇంగ్లండ్ చేరి, 1906 వ సంవత్సరము చివరికి బారిష్టరుగా భారతదేశము చేరుకున్నారు. తరువాత ఆయన కుటుంబ సమేతంగా చెన్నపట్టణం చేరి ప్రాక్టీసు మొదలుపెట్టి , కొద్ది కాలానికే బాగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఇంగ్లండ్ వెళ్ళినప్పుడు ఆయనకు దాదాభాయి నౌరోజీ, లాలాలజపతిరాయ్‌గారిని కలుసుకోవడము జరిగింది. తరువాత నెమ్మదిగా రాజకీయాలపైకి అతని దృష్టి మళ్ళింది. 1916లో డా. అనీబిసెంట్ స్థాపించిన హోమ్‌రూల్ ఉద్యమములో చేరారు.1919 ఫిబ్రవరిలో గాంధిగారి పిలుపుకు స్పందిస్తూ సి. రాజగోపాలాచారిగారితో సహా సత్యాగ్రహ ప్రతిజ్ఞ పూనినారు. డిశంబరులో అమృతసర్ నేషనల్ కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యారు. నాగపూర్ కాంగ్రెస్ సమావేశములో గాంధీగారి వలన ప్రేరేపితుడై ప్రాక్టీసు వదిలివేసారు.

1921 అక్టోబరు 29న మద్రాసు నుండి స్వరాజ్య దినపత్రిక ఆంగ్లములో, తరువాత తెలుగు, తమిళములలో వెలువరించారు. అంత విజయవంతము కానప్పటికీ ఈ పత్రికను 14 సంవత్సరములు కొనసాగించారు. 1922 మార్చిలో ఆంధ్రా ప్రొవిన్సియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తరువాత 1946 వరకు చాలా సార్లు అధ్యక్షుడుగా ఏకగ్రీవముగా ఎన్నికై ఎక్కువ సంవత్సరాలు ఆ పదవిని అలంకరించిన రికార్డ్ సృష్టించారు. 1926 డిశంబరులో కేంద్ర శాసన సభ్యునిగా ప్రకాశంగారు గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ప్రతినిధిగా రాజ్యసభకు ఎన్నికైనారు.

1928 ఫిబ్రవరి 3న సైమన్ కమిషన్ వచ్చిన తరువాత మొదటిసారి నిరసన తెలియజేసారు. మద్రాసును సందర్శించినపుడు రెండుసార్లు నిరసన తెలియజేసారు. ఆ సందర్భములో నిరసన ప్రదర్శన జరుగుతున్నప్పుడు బ్రిటిష్ అధికారి ఒక వ్యక్తిపై కాల్పులు జరపడం, అతను చనిపోవడము జరిగింది. ఆ చనిపోయిన వ్యక్తిని సమీపించడానికి అధికారులు నిరాకరించినపుడు ప్రకాశంగారు తెగువతో అతనిని సమీపించబోతే, ఆ అధికారి తుపాకిని ప్రకాశంగారి గుండెకు గురిపెట్టగా, ప్రకాశంగారు తన చొక్కా విప్పదీసి గుండె చూపించి ధైర్యం వుంటే కాల్చమని సవాలు చేసారు. అప్పుడు 'ఆంధ్రకేసరి'కి జై అనే నినాదాలు మిన్నునంటాయి.

ప్రకాశంగారు 1940 వ సంవత్సరములో విలేజ్ రిపబ్లిక్ అనే ఆంగ్ల వారపత్రికను ప్రారంభించారు. తరువాత ఈ పత్రిక తెలుగు, తమిళం భాషలలో కూడా ప్రారంభించారు. 1942వ సంవత్సరములో 'క్విట్ ఇండియా' ఉద్యమములో పాల్గొన్నారు. ఆ కారణముగా జైలుకు వెళ్ళడం జరిగింది. 1945 ఆగష్టులో మిగిలిన జాతీయ నాయకులతో పాటు విడుదల చేయబడ్డారు. 1946 వ సంవత్సరములో గాంధీగారికి ఇష్టములేకపోయినా లెజిస్లేచర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా ఎన్నుకోబడ్డారు. అదే సంవత్సరము ఏప్రియల్ 30వ తేదీన మద్రాసు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1946 ఆగష్టులో మద్రాసు విశ్వవిద్యాలయములోను, డిశంబరులో ఆంధ్రవిశ్వవిద్యాలయములోను పట్టాలను అందజేసే కార్యక్రమములో పట్టభద్రులనుద్దేశించి ప్రసంగించారు. 1947 మార్చి నెలలో మద్రాసు ప్రధాని పదవికి రాజీనామా చేసారు.

నవంబరు 1950లో ప్రకాశంగారు జె.బి. కృపలాని, రఫీ అహ్మద్ కిద్వాయ్, పి.సి. ఘోష్ లతో కలిసి కాంగ్రెస్ డెమొక్రటిక్ పార్టీని రూపొందించారు. ఈ పార్టీ 1951 జనవరి నెలలో తిరుపతిలో సమావేశమయ్యింది. 1951 ఏప్రియల్ 14వ తేదీన ప్రజాపార్టీ ఏర్పడింది. 1952 జూన్ మాసములో ప్రజాపత్రిక పేరుతో వార పత్రిక ప్రారంభించబడి, 1953లో ఆంధ్రరాష్ట్రమునకు సంబంధించిన ప్రకటన వెలువడిన కొన్ని నెలలలో ఆపివేయబడినది. 1953 మార్చి 25వ తేదీన ప్రధాని ఆంధ్రరాష్ట్రము అక్టోబరు 1న ఏర్పడుతుందని ప్రకటించారు. అయితే మే నెలలో ప్రకాశంగారు అధ్యక్షులుగా కర్నూలు రాష్ట్ర రాజధానిగా నిర్ణయించారు. 1953వ సంవత్సరము అక్టోబరు 1 వ తేదీన ప్రకాశంగారు మొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. అనంతరము ప్రకాశంగారి పాలనలో 1954 ఫిబ్రవరి 13న కృష్ణా బ్యారేజ్, 1954 జులై 5న గుంటూరు హైకోర్ట్, 1954 సెప్టెంబరు 2న వెంకటేశ్వరా విశ్వవిద్యాలయము ప్రారంభించబడ్డాయి. 1954 నవంబరు 6న ప్రకాశంగారి ప్రభుత్వము పడిపోయింది. 1956 నవంబరు 1వ తారీఖున ఆంధ్రాప్రదేశ్ అవతరణ జరిగింది. 1957 మే 20న ప్రకాశంగారు హైదరాబాద్‌లో తనువు చాలించారు. ఆయన తన సర్వస్వం దేశ స్వాతంత్ర్య సమరంలో త్యాగం చేసిన మహావ్యక్తి. మరణించిన నాటికి ఒక రాగి పాత్ర అయినా మిగుల్చుకోలేదు. నిస్వార్థ సేవ చేయడం తప్ప, ఆయన ఎన్నడూ పదవులనాశించలేదు. పదవులే ఆయనను వెదకుతూ వచ్చాయి.




ప్రముఖ న్యాయవాదిగా, పాత్రికేయునిగా, జాతీయవాదిగా, వ్యవహారవేత్తగా, స్వాతంత్ర్య సమరయోధునిగా ప్రకాశంగారి పాత్ర అనిర్వచనీయం. ప్రకాశం పంతులుగారి జన్మస్థలమైన ఒంగోలు జిల్లాను ఆయన గౌరవార్థం, ఆయన శత జయంతి సందర్భములో 1972 వ సంవత్సరములో ప్రకాశం జిల్లాగా మార్చడం జరిగింది. ఇది ఆ జిల్లా మరియు ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం చేసుకున్న అదృష్టము.

*చరిత్ర కెక్కిన చరితార్థులు శీర్షికకు మీకు తెలిసిన నాయకుల గురించి మూడు లేదా నాలుగు పుటల వ్యాసాల్ని ఆహ్వానిస్తున్నాము. వ్యాసమును ఈ-మెయిల్ ద్వారా గాని లేదా తపాలా ఉత్తరము ద్వారా గాని క్రింది చిరునామాకు పంపవలసినదని మనవి.*

***Editor,***
***Sanghamitra***
***12450 Lyric Ct.***
***St. Louis, MO 63146***
***susri@Sanghamitra.org***